క్లుప్తంగా

శ్మశానవాటికను కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అస్మత్‌పూర్ గ్రామస్తులు

మంచాల: మండలంలోని అస్మత్‌పూర్ గ్రామంలో కబ్జాదారుల నుంచి శ్మశాన వాటికను కాపాడాలని మాజీ సర్పంచ్ హరిప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాతల కాలం నుంచి అక్కడే సమాధులు కట్టుకుంటున్నామన్నారు. ఇటీవల కొంత మంది రియల్ వ్యాపారులు శ్మశాన వాటికను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేష్, సుధాకర్, శ్రీనివాస్, జంగయ్య, శేఖర్, జగన్, పారేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఎస్‌జీటీయూ మద్దతు



మాట్లాడుతున్న గణేశ్

ఇబ్రహీంపట్నం: తమ సమస్యలు పరిష్కరించాలని దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు ఎస్‌జీటీయూ జిల్లా శాఖ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా కన్వీనర్ గణేశ్, కో కన్వీనర్ శ్రీనివాస్‌లు బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గణేశ్ మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమం టైం స్కేల్, జీవిత బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రవికాంత్‌రెడ్డి, ఎస్.బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శంకరయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం క్రింద రూ.60 వేలు, ఒర్సు పద్మకు రూ.13 వేలు మంజూరయ్యాయి. ఆకుతోటపల్లి గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షఫీ, రాములు, సత్యం, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సన్నిధానానికి విరాళం



నగదు అందజేస్తున్న రాందాస్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని గడ్డమీదితండా గ్రామ పంచాయతీలో అయ్యప్పస్వామి సన్నిధానం నిర్మాణం కోసం బీజేపీ గిరిజన మోర్చ జిల్లా నాయకుడు మైసిగండి రాందాస్‌నాయక్ రూ.25 వేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం తండాలో ఏర్పాటు చేసిన అయ్యప్ప భక్తులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాండు, కిషన్, శ్రీను, లచ్చిరామ్‌నాయక్, మల్లేశ్, వినోద్,కల్యాణ్, సురేశ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలో గుంతపల్లి గ్రామంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు కళాశాల చైర్మన్ ముత్తెంశెట్టి శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి, హెచ్ఓడీ కిశోర్‌రెడ్డిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జర్నీ.. జర భద్రం

తుర్కయంజాల్: చలికాలంలో వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలి. లేదంటే ప్రమాదాల బారిన పడటంతో పాటు ఇతరులను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉంది. కార్లకు ముఖ్యంగా వైపర్ బ్లేడ్‌లను ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. కొత్తగా వచ్చే వాహనాలకు ఫాగ్ ల్యాంప్స్ ఉంటున్నాయి. కానీ పాత వాటికి ఇవి ఉండవు. ఫాగ్ ల్యాంప్ లేకపోయినా మంచు అధికంగా కురుస్తున్న సమయంలో, ఉదయం వేళ హెడ్‌లైట్‌లను వేసి వాహనం నడపాలి. లేదా హాజర్డ్స్ లైట్స్(బ్లింకింగ్ లైట్స్)ను ఆన్ చేయాలి. వాహనాన్ని రోడ్డుకు ఎడమ వైపు నుంచి తీసుకెళ్లాలి. ఎదురుగా ఇతర వాహనాలు వస్తే కొంత దూరంలో ఉన్నప్పుడే హారన్ కొట్టి అప్రమత్తం చేయాలి.

– సుభాష్‌చందర్‌రెడ్డి, ప్రాంతీయ రవాణాశాఖ అధికారి, ఇబ్రహీంపట్నం



పనుల్లో జాప్యం.. ప్రయాణికులకు శాపం



మంచాల-జాపాల రోడ్డు నిర్మాణ పనులు

- నత్తనడకన సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మంచాల: నత్త నడకన సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులతో మంచాల మండలవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దాపురించిందని వాపోతున్నారు. మండలంలో గత ప్రభుత్వ హయాంలో 2023లో ఆగాపల్లి నుంచి కాగజ్‌ఘట్ వరకు రూ.2.15 కోట్లు, మంచాల నుంచి జాపాల మీదుగా కాగజ్‌ఘట్ వరకు రూ.4.30 కోట్లు, చాంద్‌ఖాన్‌గూడ గేట్ నుంయి బుగ్గ తండా రోడ్డు వరకు మరమ్మతుల కోసం రూ.32 లక్షలు మంజూరయ్యాయి. వీటికి పనులు ప్రారంభించి దాదాపు ఏడాదిన్నర కావొస్తుంది. కానీ పనులు మాత్రం నత్తతో పోటీ పడుతున్నాయి. ఆగాపల్లి నుంచి కాగజ్‌ఘట్ రోడ్డు అసంపూర్తిగానే మిగిలి పోయింది. మంచాల నుంచి జాపాల రోడ్డు నిర్మాణ పనులు నేటికి కొనసాగుతూనే ఉన్నాయి. చాంద్‌ఖాన్‌గూడ గేట్ నుంచి బుగ్గ తండా రోడ్డుపై గోతులు పడిన చోట కంకర పోసి వదిలేశారు. ఇలా ఏళ్లు గడిచినా రోడ్ల నిర్మాణం పనులు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో ఎప్పుడూ ఇనేళ్ల పాటు రోడ్డు వేసిన దాఖలాలు లేవని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులకు ఇబ్బందులు

రోడ్డు నిర్మాణ పనుల విషయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాడైన రోడ్డపై ప్రయాణిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభించి నెలలు గడిచిన పూర్తి కావడం లేదు. నిత్యం గుంతలమయమైన రోడ్ల మీద ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేగవంతంగా చేయాలి



ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చేసిన పనులకు బిల్లులు రాక, మధ్యలోనే వదిలేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వమే స్పష్టతనిచ్చి, రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

– శ్రీశైలం, మంచాల

గోతులతో ఇబ్బంది



ఆరుట్లకు వెళ్లే రోడ్డుపై గోతులు ఏర్పడి చాలా ఇబ్బందిగా మారింది. కాగజ్‌ఘట్ రోడ్డు కూడా అదే దుస్థితి. ప్రభుత్వం వేస్తున్నామని ఏడాదిగా చెబుతుంది. ఇంకా పనులు పూర్తి కావడం లేదు. ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– హరిప్రసాద్, మాజీ సర్పంచ్, అస్మత్‌పూర్

చర్యలు తీసుకుంటాం



ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు నడుస్తున్నాయి. పూర్తి స్థాయిలో కంకర పోసి తొక్కించిన అనంతరం బీటీ వేస్తారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తవ్వడానికి చర్యలు తీసుకుంటాం.

– అబ్బాస్, డీఈఈ, పీఆర్



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా తయారు చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని చీదేడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గునుకుల తిరుమల్లేష్‌కు నియామకపత్రం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని బలమైన శక్తిగా చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో మహిళలను, యువతను కలుపుకొని ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండు రంగారెడ్డి, గురునాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లేష్, రమాకాంత్‌రెడ్డి, జంగయ్య, రాజు, బాలయ్య, రామకృష్ణ, శ్రీనివాస్‌నాయక్, కిషన్‌నాయక్, ఐలయ్యయాదవ్, శివయాదవ్, శేఖర్, సంపత్‌రెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పడిపూజ

ఇబ్రహీంపట్నం: స్థానికంగా ఉన్న అయ్యప్ప దేవాలయంలో బుధవారం మహాపడి పూజ చంద్రమోహన్‌నాయర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ నాయిని సత్యనారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప స్వామి నామ స్మరణతో మార్మోగింది. స్థానిక ఏసీపీ కేపీపీ రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వాములు, భక్తులు హాజరయారు. గొరిగే రవి, చంద్రమోహన్‌నాయర్, నాయిని సత్యనారాయణలు గత 41 రోజులుగా ఆలయంలో ఉండే స్వాములకు అన్న ప్రసాదం సమర్పిస్తున్నారు.



ఇబ్రహీంపట్నం: పడిపూజకు హాజరైన ఏసీపీ రాజును సన్మానిస్తున్న కౌన్సిలర్ సత్యనారాయణ

వైభవంగా పడి పూజ

ఆమనగల్లు: మండలం రాంనుంతల గ్రామంలో బుధవారం బాణావత్ సురేశ్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పడి వద్ద ముందుగా అయ్యప్ప స్వామికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాముల శరణుఘోష మధ్య బాణావత్ సురేశ్ స్వామి పడిని వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు సోమ, నాగేందర్, రాంచందర్, అప్పి, స్వాములు శ్రీశైలం, వంశీ, నరేశ్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లోని భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న నంది దేవతా, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా బుధవారం హోమాలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



జాపాలలో లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్యులు

మంచాల: పాడి పశువుల పెంపకంపై రైతులు తప్పక జాగ్రత్తలు తీసుకోవాలని ఆరుట్ల పశువైద్యురాలు నాగమణి సూచించారు. బుధవారం మండల పరిధిలోని జాపాల గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు గర్భకోశ నివారణ చికిత్స శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పాడి పశువుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రధానంగా పాల ఉత్పత్తిపై ఆధారపడి రైతులు జీవనం సాగించడం జరుగుతుందన్నారు. పశువులకు పోషక విలువలు గల పచ్చి పశుగ్రాసం అందించాలన్నారు. నట్టల నివారణ మందులను లేగ దూడలకు వేయాలన్నారు. శిబిరంలో 120 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామన్నారు. 45 దూడలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యురాలు సుధా, వంశీ కృష్ణారెడ్డి, సిబ్బంది వీరారెడ్డి, బాబు, శ్రీను పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్: జంతు శాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21వ తేదీ లోపు సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలలో సమర్పించాలని ఆయన సూచించారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

కడ్తాల్: అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ శివప్రసాద్ హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని పలు కిరాణ దుకాణాలు, ఫాంహౌస్‌లు, వాహనాలను పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కిరాణ షాపుల్లో గుట్కా, మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాలు, గంజాయి జోలికి వెళ్లవద్దని, వారిని వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫాంహౌస్‌లలో నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ట్రైనీ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోతున్న కాంగ్రెస్



రాజు సమక్షంలో బీజేపీలో చేరుతున్న యూత్ కాంగ్రెస్ సభ్యులు

బీజేపీ జిల్లా కార్యదర్శి రాజు

యాచారం: తెలంగాణ ప్రజల చూపు మొత్తం బీజేపీ వైపు మళ్లుతుందని, గత 15 ఏళ్లుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూస్తున్న ప్రజలు ఆ పార్టీలపై విశ్వాసం కోల్పోయారని బీజేపీ జిల్లా కార్యదర్శి డేరంగుల రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకుడు డేరంగుల కొండల్‌తో పాటు మరి కొంత మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక గ్రామాల్లో బీజేపీ మద్దతుదారులే సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులుగా గెలిపించుకునే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, వినోద్, యాదయ్య, జంగయ్య, శ్రీధర్‌రెడ్డి, యాదగిరి, స్వామి, ధోని, రమేష్, భాస్కర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో వైద్యులు, నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్- రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి వైద్య బృందం సౌజన్యంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్‌తో కలిసి డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా ప్రారంభించారు. వైద్య శిబిరంలో కామినేని ఆసుపత్రి వైద్యులు అఖిల్, అనిల్ ఆధ్వర్యంలోని 292 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వినోద్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, నాయకులు జంగయ్య, యాదయ్య, మహేశ్, శంకరయ్య, వెంకట్‌రెడ్డి సతీశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

కేవీఎన్‌రెడ్డిని సత్కరించిన నేతలు

ఆమనగల్లు: రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డిని ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు నాయకులు సత్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అప్పం శ్రీను, ఆసిఫ్ అలీ, రెడ్డి సేవాసమితీ నాయకులు రూపం వెంకట్‌రెడ్డిలు సన్మానించారు.

అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

కడ్తాల్: అక్రమ అరెస్టులకు నిరసనగా తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య మాట్లాడుతూ.. ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద ధర్నాకు అనుమతించిన ప్రభుత్వం ఆ తర్వాత అరెస్టులు చేయడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, కుమార్, చెన్నయ్య, అంజయ్య, జంగమ్మ, వసంత, సుజాత తదితరులు ఉన్నారు.

జోరుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఇబ్రహీంపట్నం: మండలంలోని ముకునూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం ఇబ్రహీంపట్నం మండల స్పెషలాఫీసర్ నవీన్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ వెంకటమ్మలు పరిశీలించారు. సర్వే యాప్‌లో ఏ విధంగా అప్‌లోడ్ చేస్తున్నారని, ఎన్ని ఫొటోలు తీసుకుంటున్నారని తదితర అంశాలను పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి సర్వే తీరును పరిశీలించారు. 25వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలని మండల స్పెషలాఫీసర్ నవీన్‌కుమార్ రెడ్డి సూచించారు.



ఇబ్రహీంపట్నం: ముకునూర్ గ్రామంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఆమనగల్లు: అర్హులైన వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. అర్హత కలిగిన వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఆయన వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి తండాలో బుధవారం మున్సిపల్ అధికారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఆయన పాల్గొన్నారు. మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీఓ కుసుమమాధురి పరిశీలించారు.

మాడ్గులలో..

మాడ్గుల: ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ పద్మావతి కోరారు. మండలంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. నల్లవారిపల్లిలో సర్వే తీరును ఎంపీడీఓ పద్మావతి పరిశీలించారు. యాప్ ద్వారా సర్వే చేపట్టిన కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.

12,484 దరఖాస్తులు

మంచాల: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా చేయాలని మంచాల ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సర్వేను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచాల మండలంలో 12,484 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఉన్నతాధికారులు ఆదేశానుసారంగా ముందుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి సూచించారు. మండల పరిధిలోని యాచారం, నందివనపర్తి తదితర గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వేను వేగవంతం పూర్తి చేసి వెనువెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో యాచారం పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: కార్యదర్శిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ శ్రీవాణి

పారదర్శకంగా చేపట్టాలి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీఓ శ్రీవాణి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేల్లో భాగంగా బుధవారం మండలంలోని అబ్దుల్లాపూర్‌మెట్, లష్కర్‌గూడ గ్రామాల్లో అధికారుల సర్వే తీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ డిసెంబర్ 31 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, లష్కర్‌గూడ పంచాయతీ కార్యదర్శి బబిత తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియానికి స్థలం కేటాయించాలి

ఆమనగల్లు: పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శి కొత్ర మల్లేశ్, సభ్యులు తిరుపతి, ఎంగలి ప్రసాద్, కల్యాణ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని కోరుతూ వారు ఆర్డీఓకు వినతి పత్రం అందించారు.